# నందనవనం - 14

‘‘అదేమిటో... ఆ వయసులో నాకు అహం కొంచెం ఎక్కువే ఉండేదని నేనూ గుర్తించగలిగాను! బహుశా... చాలామంది నా అందచందాలకు, తెలివి తేటలకు దాసోహమైపోయినట్లు... వెంటబడుతూ ప్రేమకోసం వేధిస్తూ ఉండటం వలన... నాలో అలాంటి భావం ఏర్పడి... స్థిరపడిపోయిందన్నమాట! మిమ్మల్ని మా ఇంటికి రమ్మనమని పిలవకుండా మా ఇంటిని మాత్రమే దూరంనుండి చూపించానా, మీరు మీ ఇంటికి రమ్మని పిలిచిన రోజు మాత్రం... సందేహించకుండా వెంటనే తలవూపేశాను. మీరు నగరాల్లో ఉంటున్నవాళ్ళు కదా, తమ అబ్బాయి స్నేహితురాలంటూ ఎవరిని తీసుకువచ్చినా అపోహపడకుండా ఆదరంగానే పలుకరిస్తారని అర్థం చేసుకోగలిగా! మా ఇంట్లో పరిస్థితులు మాత్రం పూర్తిగా వేరే. నా ఉద్యోగం కోసం అక్కడికి వచ్చి ఉంటున్నా... ఆచార వ్యవహారాల్లో మా నాన్నగారు ఏమాత్రం మార్పునూ సహించరు. మిమ్మల్ని వెంటబెట్టుకు వెళ్తే... అప్పటికి అంటీ ముట్టనట్టు ఉండి మర్యాద చూపించినా, తర్వాత నన్ను అనుమానంగా చూస్తూ సవాలక్ష ప్రశ్నలతో విసిగిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ భయంతోనే మీరెపుడు, మీ కారులో లిఫ్టు ఇచ్చినా మా వీధి మొదట్లోనే దిగిపోయేదాన్ని!

మీ ఇంటిముందు... మీరు కారు ఆపినపుడు... నిజంగా రాజ ప్రాసాదంలా ఉన్న ఇంటిని చూడగానే మతిపోయి నేనూ అప్రయత్నంగా ‘‘ఇదా....’’ అనేశాను!’’

‘‘ఏమిటోనండీ... మన ఇష్టానికీ, అభిరుచులకీ వ్యతిరేకంగా చాలా జరిగిపోతుంటాయి. తప్పని పరిస్థితులకి... తలవంచాల్సి వస్తుంది! చక్కగా చిన్న ఇంట్లో ఒద్దికగా ఉండాలనే మా కోరిక తీరలేదు! మా నాన్న స్నేహితులందరూ కలిసి ఇది

కొనిపించారు...’ అంటూ నసిగాను. పెద్ద ఇంట్లో ఉండటం నేరమన్నట్లుగా ఏదో తప్పు జరిగిపోయినట్లు, నీకలాంటి సంజాయిషీ ఇచ్చుకున్నాను...!’’ అన్నాడాయన నవ్వుతూ.

‘‘రాజ భవనం లాంటి ఇంటిలో ఉంటున్నా... మీ వాళ్ళు వేషభాషల్లో, ప్రవర్తనలో చాలా సాదాసీదాగా ఉండటం నాకు చాలా బాగా నచ్చింది! మీ నాన్నగారే స్వయంగా కొన్ని పనులు చేస్తూండటం గమనించి ఇంకా విస్తుపోయాను! తర్వాత దర్జాగా... మాంచి దుస్తుల్లో ఉన్న పనివాళ్ళను చూసి మరీ ఆశ్చర్యపోయా!’’

‘‘ఆ విషయం నేనూ గుర్తించాను. మా నాన్నకి కొంచెం సేపయినాసరే ఖాళీగా ఉండటం నచ్చక ఏదో పని కల్పించుకుంటారని అందుకే నీకపుడు చెప్పాను. నాన్న మాకూ అదే నేర్పించారు. మనసుకు, శరీరానికి కష్టపడటమనేవి అలవాటు చేస్తూ ఉంటేనే, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకుని ఆనందంగా బ్రతకగలం అని నాన్న ఉద్దేశ్యం!’’

‘‘నిజంగా అది చాలా విలువైన పాఠం! అందుకేగా ఇపుడిలాంటి ఇంట్లో ఉంటూ, పొలంలో కష్టమూ చేస్తూ, సరదాగా ఉండగలుగు తున్నారూ...!’’

‘‘మానాన్న నేర్పించిన ఆ పాఠం ఒక కారణమైతే... నా ఆనందకర జీవితానికి అసలైన కారణం మాత్రం... నువ్వే...! వనవాసానికైనా సంతోషంగా సిద్ధపడిపోయే సీతాదేవిలాంటి సహచారి దొరకటమే మగవాడి అదృష్టం...! ఆనందంగా సాగే కుటుంబ జీవనం ఎవరికైనా గొప్పవరం...!’’ ఆయన కళ్ళు మెరిసాయి.

శ్రీవల్లి సరదాగా నవ్వింది ‘‘మీకిపుడు తెలిసిందేమోగానీ... మిమ్మల్ని చూసిన మొదటిరోజునే నాకీ విషయం అర్థమైంది! ఆ రాత్రివేళ మీతో కలిసి కారులో మా ఇంటికి

బయలుదేరినపుడు మనసులోనే అనుకున్నాను ‘ఆశ్రయం కోరి వచ్చిన అమ్మాయి చెంతనే ఉన్నా.... మర్యాదగా హుందాగా ప్రవర్తిస్తున్న ఇలాంటి వాడు కారు కాదు, ఎడ్లబండి నడిపేవాడయినా అడిగితే కాదనకుండా ఏ అమ్మాయైనా నిశ్చింతగా అతని వెంట జీవితాంతపు ప్రయాణానికి అంగీకరించవచ్చునూ అని...! పైగా.... ఎటువంటి స్వార్థపుటాలోచనా లేకుండా... ఎవరో అపరిచితురాలు ఎటువంటి పరిస్థితుల్లో చిక్కడిపోయిందోనని... సాయంగా ఉండి, శ్రమ తీసుకుని వాళ్ళింటికి చేర్చాలనుకోవటం ఎంత గొప్ప విషయం’ అనుకుంటూ మనసులోనే అభినందించాను కూడా!’’

‘‘మరి... ఆ మాట నాతో ఎపుడూ చెప్పలేదేం...?’’

ఆయన ప్రశ్నకి శ్రీవల్లి చిరునవ్వుతో చూసింది.

‘‘అన్నీ విడమరిచి చెప్పనక్కర్లేదు... ఆ విషయం తర్వాతర్వాత మీరూ తెలుసుకోగలగారని నాకూ తెలుసు కదా! మీ తీరు చూసే... నేనపుడు ‘మీకు శ్రీరాముడు అంటే ఇష్టంకదా...!’ అనడిగా. ఎందుకో నాకు ఆ సమయంలో రాముడు గుర్తుకు వచ్చాడు! చిన్నపుడు అందరం ‘మంచి బాలుడు రాము’ అని చదువుకున్న వాళ్ళమేగా. అందువలనే చక్కగా ప్రవర్తించేవాళ్ళని చూసినపుడు ఆ పోలిక ఠక్కున గుర్తుకు వచ్చేస్తుంది! అందుకనే మిమ్మల్నీ అలా అడిగి ఉంటా...!’’

‘‘నువ్వలా అడగగానే నాకు విపరీతంగా ఆశ్చర్యం కలిగింది! సడన్ బ్రేక్ వేసి ‘రాముడి గురించేనా మీరడిగారూ... నేను సరిగానే విన్నానా...’ అనడిగితే, నువ్వు నాలాగే ఆశ్చర్యపోతూ ‘అవును... అయితే ఏం...?’ అనడిగావు. నేనపుడూ ఎంతో భక్తితో ఇష్టంగా ‘రామచంద్రా’ అని రోజుకు ఎన్నిసార్లు స్మరిస్తానో చెప్పలేను! ఈ అలవాటు మాటమాటకీ ‘రామచంద్రా’ అంటూండే అమ్మవలన నాకూ వచ్చి ఉంటుంది! అయితే

నేను మాత్రం అమ్మలా పైకి అనకుండా మనసులో మాత్రమే అనుకుంటూ ఉంటాను. ఏమిటో .... ఆ మధ్య ఎవరో రాముడి గురించి కొత్త వాదన చేయటం విన్నాను! రాముడిలో కనుపించే ఎన్నెన్నో సుగుణాల గురించి ప్రస్తావించుకుని స్ఫూర్తిగా తీసుకోవటం బావుంటుంది గానీ మనకు నచ్చని అతని ప్రవర్తనలోని లోపాల గురించి గొడవ ఎందుకూ అనిపించింది...! 'ఒకడి మాట పట్టుకుని... సీతమ్మ గురించి.... అందరకూ తెలియజేయాల్సిన అవసరం ఏమిటీ' అని ప్రశ్నించి, అలా చేయక ఎలా చేస్తే రాముడి వ్యక్తిత్వం ఇంకా గొప్పగా

ఉండేదోనని తమ భావనలు తెలియచేయటం సమంజసమేగానీ, మరీ చీల్చి చెండాడినట్లుగా విమర్శించటం ఎందుకో...!

నా ఉద్దేశ్యం మాత్రం... ఎవరిలోనైనా మంచిని గుర్తించి... కీర్తిస్తూ... అలాంటి ప్రవర్తన అలవరుచుకోవాలని బోధించటం వలన ప్రయోజనం ఉంటుంది గానీ విడ్డూరంగా తోచిన విధానాలను విమర్శించి... అలాంట దారి మంచిది కాదని హెచ్చరించటం సరిపోతుందికదా?''

''ఈ మాటలు మీరు చెబుతున్నపుడు.... నేను ఆశ్చర్యానందాలతో మీ చేతిని పట్టుకుని హుషారుగా ఊపేశాను! మీకు అర్థంకాక మళ్ళీ కారును ఆపి 'ఏమైందీ?' అనడిగారు... అపుడు... నేను స్పృహలోకి వచ్చి కొంచెం సిగ్గుపడుతూ 'మీకు ఆశ్చర్యం కలిగితే కారు ఆపేస్తున్నారు. నాకా అవకాశం లేక నా ఆశ్చర్యాన్ని ఇలా చూపించానన్నమాట...! సరిగ్గా... మీరిపుడు చెప్పినవి నా మనసులోని మాటలే...! మీ నోటివెంట వినగానే ఇలా ఆశ్చర్యం కలిగింది... అంతే' అన్నాను... అవునుకదూ? నేను చెప్పినదారిలో తీసుకువచ్చారు. ఆ వీధి దగ్గర కారు దిగి, చాలాసాయం చేశారు' అని థేంక్స్ చెప్పినట్లు రెండు చేతులూ జోడిరచి, నమస్కరించేసరికి... ''మీ చేతుల్ని అలా

చూపించకండి'' అంటూ రివ్వున వెనుదిరిగి వెళ్ళిపోయారెందుకో నాకు అర్థం కాలేదు. నా చేతుల్ని చూసుకుంటూ తప్పేం జరిగిందని ఎంత ఆలోచించినా అంతుబట్టక ఒక నిముషం అలాగే ఉండిపోయాను. నాలుగిళ్ళ అవతలే మా ఇల్లు కాబట్టి చకచకా అడుగులు వేస్తూ వెళ్ళిపోయానా... ఇక ఇంట్లో నా కోసం ఎదురుచూస్తూ ఆదుర్దాగా ఉన్నవాళ్ళందరి మొహాల్లో రిలీఫ్ కనుపించింది. అది ఒక క్షణమే... ఆ తరువాత ఏ సంగతీ తెలియజేయకుండా అంత ఆలశ్యం చేయటమేమిటని నా మీద విరుచుకు పడ్డారు. అదంతా వేరే సంగతి గానీ....ఆ రాత్రి మాత్రం ఆలోచనలతో నాకు నిద్రపట్టనేలేదు! అదే విషయాన్ని కొంచెం పరిచయం కలిగిందనుకున్నాక మిమ్మల్నీ అడిగాను కదా...!''

''అప్పుడు నేనూ సంకోచించకుండా మనసులోని మాటను  చెప్పేసాను... కారులో వస్తున్నపుడు డ్రైవ్ చేస్తూనే, అపుడపుడూ తలతిప్పి మీ వైపు చూస్తూంటే... మీ అందమైన చేతుల్నిచూసి... ఒకసారి మెల్లగా తాకుదామా అనే కోరిక నన్ను బాగా కలవర పెట్టేసింది! అసలే మీరు... నన్నేమో మంచి బాలుడు కేటగిరిలో వేసేసారు! అలాంటి పనిచేయటం ఏమిటని... నన్ను నేను నిగ్రహించుకోగలిగా! ఇదంతా చెప్పేసి చివరగా 'చూడండి... మనసులో ఇలాంటి ఆలోచనలు పెట్టుకుని పైకి మాత్రం పెద్ద మనిషిగాఎలా నటించగలిగానో....'' అన్నా. మీకు కొంచెమైనా కోపం వస్తుందనుకున్న నా అంచనా తప్పింది! పకపకమని నవ్వేసి... ''నిగ్రహం పాటించటం మర్యాదస్తుల లక్షణం. మనసులో పెర్రిమొర్రి ఆలోచనలు వచ్చినపుడు మందలించు కోవటమూ మంచివాళ్ళ లక్షణమే!

మీకు నిజాయితీ ఉంది కాబట్టి....నిష్కల్మషంగా చెప్పేయగలిగారు... కొందరు తప్పుచేసామని తెలిసినా అది ఒప్పుకోవటానికి ఇష్టపడక ఏదో విధంగా

సమర్థించుకోవాలనే చూస్తారు! మీలో నిగ్రహమే కాదు నిజాయితీ కూడా ఉంది!' ఈమాటల్ని నేనపుడు మీతో మనస్ఫూర్తిగానే చెప్పానుగా...!''

''అవును... నన్ను మెచ్చుకుంటున్నట్లుగా చెప్పిన ఆ ఒక్క మాటకే... ఒక్క గెంతులోనే అంబరాన్ని అందుకోగలిగినంత సంబరం కలిగింది! మీ దగ్గర మంచి మార్కుల్ని సంపాదించగలగానన్న ఆనందం...! ఇంకోసారీ మీ నాన్నగారి దగ్గరా ఇలాంటి ప్రశంసా పత్రాన్నే అందుకోగలిగాను...!''

''అదీ నాకు గుర్తుంది. ఆరోజు... మీరు మా ఇంటికి చెప్పా పెట్టకుండా వచ్చేసారు... గుమ్మందగ్గరే ఎదురైన మా నాన్నగారు... 'ఎవరు కావాలీ, ఏం పనిమీద వచ్చారూ' లాంటివన్నీ ముగించి... 'మీ ఆఫీసులోనే పనిచేసే అబ్బాయట.... ఏదో సమాచారం కావాలని నీకోసం వచ్చాడటా' అనే కబురందించారు. అమ్మా, నేను హడావుడిగా టిఫిను ఏర్పాట్లులో పడితే, మా నాన్నగారు మీతో బాతాఖానీ వేసుకున్నారు.

మా నాన్నకి అపుడపుడూ అమ్మతో సంస్కృతంలో మాట్లాడే సరదా ఉంది. అమ్మకీ కొంచెం నేర్పించారు. ఆ సమయంలో ఏదో... పద్యంలో వాక్యం చెప్పారు కదూ? ఆ గుర్తుకొచ్చింది... 'శివుడుని... నీకు ఇద్దరెందుకూ.. పార్వతి చాలును, గంగను విడువుమా' అని శ్రీనాధుడో మరెవరో అర్థించటం... దాని అర్థం!' మా అమ్మ 'ఏమిటీ పిలిచారా' అంటూ లోపల నుండి నాన్నగారి దగ్గరకు వచ్చి అడిగితే, 'ఏం లేదూ, ఒక గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చివ్వండీ... అదే అడుగుతున్నారనుకుంటా...' అని మీరు చెప్పగానే మా నాన్న ఆశ్చర్యంతో ఉబ్బితబ్బిబ్బు అయిపోయి... మీ విజ్ఞానానికీ, భాషా పరిజ్ఞానానికీ మురిసి మెచ్చేసుకున్నారు... అవునా...?''

''మీ ఇంట్లో వాళ్ళని పరిచయం చేసుకుందామని వస్తే.... నా పాండిత్యాన్ని ప్రదర్శించి... అలాంటి ప్రశంసల్ని దక్కించుకోగలిగాను...!'' అంటూ ఆయన సరదాగా నవ్వాడు.

''ఆ తర్వాత మా నాన్న మిమ్మల్ని ఎంతగా మెచ్చేసుకున్నాడో...! అసలు మిమ్మల్ని చూసీ చూడగానే చాలా గొప్ప వ్యక్తిత్వం ఉన్నవాడని పసిగట్టేసారట! చూపుల్లోని చురుకుదనమే మీ తెలివితేటల్నీ తెలియపరిచేస్తోందట! మాటల్లోని స్పష్టత, మర్యాద... ఎంత ఎత్తుకి ఎదగగలరో వివరిస్తోందట... ఇలా రకరకాలుగా వర్ణించేసారు! ఆ తర్వాత మనమిద్దరం ఓ నిర్ణయానికి వచ్చి.... అనుమతి కోరినపుడు... అభ్యతరం చెబితే, ఈ మాటలన్నీ గుర్తుచేస్తే అప్పుడు కదా ఒప్పుకున్నారు'' అంటూ శ్రీవల్లి కిలకిల నవ్వింది.

''ఇక ఈ రోజుకి ఈ ముచ్చట్లు ప్రోగ్రాంకి ముగింపు పలుకుదాం... ఇక తర్వాతవీ ఆ సంగతులన్నీ చెప్పుకోవటం మొదలు పెడితే... ఓ పట్టాన పూర్తికావు..!'' అంటూ శ్రీవల్లి లేచి నిలబడిరది. సరదాగా ''అవును కదూ సుబ్బుగారూ...?'' అనీ అడిగింది.

ఆయనా చిన్నగా నవ్వి ''జీ హుజూర్... అబ్బురాల అమ్మాయిగారూ'' అన్నాడు. అపుడపుడూ హుషారు కలిగినపుడు అలా పిలుచుకోవటం అలవాటే ఇద్దరికీ! తర్వాత ఆయన ''పిల్లలు అక్కడ ఏవో ముచ్చట్లు పెట్టుకున్నారనుకుంటూ మనం ఇక్కడ మొదలు పెట్టాం...!'' అని ''లచ్చిందేవీ... ఓ చిన్న సందేహం.... నందూ అడిగిందని ఈ కబుర్లన్నీ చెబుతావా....?'' అనడిగాడు.

శ్రీవల్లి మళ్ళీ నవ్వింది. ''వాళ్ళ సరదా సంగతులు వాళ్ళవీ, మనవి మనవీను... ఒకరివి ఒకరు చెప్పుకోవటం ఎందుకూ... ఎవరివి వాళ్ళకి విలువైనవీ, తీయనైనవీ!

మనసులోనే దాచుకోవాలి! అపుడపుడూ తలుచుకోవాలిగానీ... అందరికీ చెప్పుకోవటం అనవసరం కదా...! సినిమాలోనో, ఏ కథలోనో ఎవరైనా పెద్దవాళ్ళు ముసిముసి నవ్వులు ఒలకబోస్తూ 'మారోజుల్లో... మేం...' అంటూ ముచ్చట్లు మొదలు పెట్టటం చూడటమే నాకు చాలా చిరాకనిపించేది! అలాంటిది నేనెందుకు చెబుతానూ....?'' అంది.

''సందర్భాన్ని బట్టి... పెద్దవాళ్ళు తమ అనుభవాలు పిల్లలకు చెప్పటం వాళ్ళ సమస్యల్ని సరిదిద్దుకోవటానికి ఉపయోగపడవచ్చనే భావంతో చెబుతున్నారనుకోవచ్చు కదా?''

''కొన్ని కొన్ని అనుభవాలు సమస్యలకి పరిష్కారాలుగా చెప్పుకోవటం బాగానే ఉంటుంది కానీ.... ఇలాంటి ప్రేమాయణాల ప్రసక్తే నాకు అనవసరమనిపిస్తుందంటున్నా! నా ఇష్టం నాదికదా...!'' అంది శ్రీవల్లి.

''మనమిలా ఆ రోజుల కబుర్లను నెమరేసుకునేసరికి... నాకు హుషారొచ్చేసి, నీ చేయి పట్టుకుని షికారుకెళ్ళి రావాలనిపిస్తోంది...! మరి నీకూనా...?''

లేదన్నట్లు తలవూపిన శ్రీవల్లి అంది. ''నాకేం అలాంటి కోరికలు లేవు. పిల్లలు ఎదిగాక తల్లిదండ్రుల తపనా, తాపత్రయం అంతా వాళ్ళ మీదే ఉంటుందనుకుంటా! వ్యక్తిగత సరదాలకు ప్రాముఖ్యత తగ్గిపోతుంది... పిల్లలకు మంచి భవిష్యత్తు ఏర్పరచాలన్నదే ప్రధానమైన కోరికవుతుంది!

మన ముచ్చట్ల దశ ముగింపుకి రాబోతోంది! కొడుకు జంట జీవితం ఇక ప్రారంభం కానుంది! ఏ ఒడిదుడుకులూ లేకుండా వాళ్ళ సంసార జీవితం సవ్యంగా సాగిపోవాలన్న అభిలాషే మిగిలి ఉంది!''

‘‘మొన్న మొన్నటి వరకూ రామం చదువు సంధ్యల గురించి ఆలోచనలు చేసేదానివి. ఆ తర్వాత ఎలాంటి కోడలు వస్తుందోననీ ఆదుర్దా చూపించేదానివి! ఇపుడవన్నీ ఓ కొలిక్కి వచ్చేసాయిగా, ఇంకా నీకీ ఆలోచనలెందుకూ వాళ్ళ గురించి....? అంతా బాగానే ఉంటుందన్న ఆశాభావమే ముఖ్యమని నువ్వే అంటుంటావుగా...!’’

‘‘అవును... నిజమే...! అందచందాలు, గుణగణాలూ అన్నీ ఉన్న అమ్మాయి మనవాడికి సరిజోడీగా దొరకటం.... నిజంగా వాడిదికాదు, మనదే అదృష్టం అనిపిస్తుంది!’’ అంది శ్రీవల్లి సంతృప్తి నిండిన గొంతుతో సంతోషంగా.

* * *

పొలంలో దిగి, మిగిలన వాళ్ళతో పనిచేయిస్తూ, చేస్తున్న ఆయన దూరం నుండే గట్టుమీద చకచక నడిచి వస్తున్న శ్రీవల్లిని చూసి... పని వదిలేసి ఓ మూల ఉన్న చిన్న పాకలోకి అడుగులు వేసాడు.

వడివడిగా నడిచిన ఆయాసాన్ని తీర్చుకుంటూ ఒక క్షణం అలాగే నిలబడిరది శ్రీవల్లి.

శ్రీవల్లిని నఖశిఖ పర్యంతం పరికించి చూసి... ‘‘నువ్వు నీ ఊహాచిత్రాన్ని వర్ణించినట్లుగా అచ్చంగా అలాగే తయారయ్యావే....!’’ అంటూ చిరునవ్వుతో చూశాడు.

నలుపురంగులో సన్నగళ్ళున్న పసుపురంగు చీర కట్టుకుని క్యారియర్ పట్టుకుని వచ్చింది.. ఒక క్షణం శ్రీవల్లి కళ్ళు అరమోడ్పులయ్యాయి సిగ్గుతో.

మరుక్షణం సరదాగా నవ్వేసింది. ‘‘నేనేమనుకున్నానో తెలుసా....? చీరచెంగును మెత్తగా చుట్టి నెత్తిమీద అన్నం దుత్తను పెట్టుకుని వద్దామనుకున్నా. అలా కుదరక,

అంత గోడపెందుకుని క్యారియర్‌లోనే సర్దుకుని వచ్చేసా. ఇంకా ఆలశ్యం చేస్తే... మీరే ఇంటికి వచ్చేస్తారేమోనని కొంచెం ముందుగానే బయలుదేరాను!'' అంటూ వివరంగా చెప్పింది.

ఆయన చిరునవ్వుతో అన్నాడు. ''ఇంత ఎండనపడి వచ్చావు సరేగానీ, కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే... సరిపోయేదిగా...?''

శ్రీవల్లి ఫక్కుమంది. ''అందరూ నన్ను చూసి వెక్కిరించటానికా...? ఇది పల్లెటూరని మర్చిపోయారా...?''

''రోజులు మారాయని నువ్వే గుర్తించటం లేదు! ఎన్నో ఫ్యాషన్లలో, అలవాట్లలో వీళ్ళే ముందుంటున్నారు! ఎవరైనా కొందరు ఇష్టం ఉన్న

వాళ్ళు కొత్తదారిన నడిచేవాళ్ళని చూసి వాళ్ళూ అనుసరిస్తారు ధైర్యం తెచ్చుకుని. మరికొందరు 'ఇదేమిటమ్మా...?' అని మొహంమీదే విమర్శిస్తారు! అలాంటివాళ్ళకు నువ్వూ సమాధానం చెప్పగలగాలి... 'ఇవి కళ్ళకు ఎండ తగలకుండా పెట్టుకునే చల్ల కళ్ళద్దాలు.... మీరూ పెట్టుకుని చూడండి... కళ్ళకు మంచిదీ' అని వివరించావనుకో.... వాళ్లూ ఆలోచనలో పడతారు...! అవునా...?''

''అవునుగానీ... ఇక తినటం మొదలు పెడదాం....'' అంటూ శ్రీవల్లి అనువైన చోటు చూసి కడిగి తెచ్చిన అరిటాకులు రెండూ పరిచి.... వడ్డించే పనిలో పడిరది.

శ్రీవల్లి చుట్టూ చూసి ''వాళ్ళందరూ అలా గట్టుమీద కూర్చున్నారేం....! ఇక్కడ నీడపట్టున కూర్చుని తినవచ్చుగా...?'' అనడిగింది.

‘‘వాళ్ళందరూ రోజూ ఇక్కడే కూర్చుని తింటారు.కొందరికి వాళ్ళ వాళ్ళు తీసుకువస్తే, కొందరు వచ్చేటపుడే క్యారియరు తెచ్చుకుంటారు! నిన్ను చూసి... ఈ రోజు అందరం కలిసే ఇక్కడ కూర్చుని తిందామని చెప్పినా వాళ్ళు వద్దనేసారు! వాళ్ళకి స్వతంత్రంగా ఉండదనిపించిందో, ఏమో మరి!’’ అంటూ వివరం చెప్పి ఏదో గుర్తుకొచ్చినట్లు చిద్విలాసంగా చూశాడు.

‘‘నువ్వలా నడిచివస్తున్నపుడు చూడగానే... కవిత్వం ఏదో మనసు లోంచి పొంగుకొచ్చి... పాట పాడాలన్నంత ఉల్లాసం నన్ను ముంచెత్తింది... తెలుసా? ‘బువ్వెత్తుకొచ్చిందీ... బుల్లెమ్మ’ అని ఓ మాట కూడా మనసులోకి వచ్చింది! నా కోసమే సుమా అనుకుంటూ మనసులో మీసం మెలేయగలిగాను. గానీ... ఇంకో మాట మాత్రం స్ఫురించలేదు! ఇక పాటంతా అంటే... నావల్లేం అవుతుందీ...?’’ విచారాన్ని అభినయించేసరికి శ్రీవల్లి ఫక్కున నవ్వింది.

అలా సరదా కబుర్ల విహారాల మధ్య ఆహారం ఆరగింపు పూర్తి చేశాక, ఓ నాలుగు నిముషాలు కూర్చుని శ్రీవల్లి ఇంటికి బయలుదేరుతూ అంది.

‘‘ఎపుడైనా ఎక్కువ పని ఉన్నపుడు మాత్రం ఇలా తినటం సరేగానీ, ఇంటికే వచ్చి భోజనం చేయటం బావుంటుందేమో!’’

‘‘... నీకోరిక అపుడే తీరిపోయిందన్న మాటేగా...?’’ అన్నాడాయనా చిన్నగా నవ్వి.

‘‘అదేం కాదు. రోజంతా పని ఉండి ఉండాల్సినపుడు భోజనం తీసుకురావచ్చుగానీ... మామూలపుడు ఇంటికి వచ్చి భోజనం చేస్తే, కాసేపు విశ్రాంతి తీసుకోవటం... వీలవుతుంది. ఈ వయసులో అదీ అవసరం కదా...! నేనిలా రోజూ

తేవటం అంటే... ఇంటికి రాకుండా సాయంకాలం వరకూ ఇక్కడే ఉండమని చెప్పినట్లుగా ఉండదూ....?''

ఆయన అంగీకారంగా తలవూపి ''నువ్వేదంటే అదే... కాదనటం ఉండదుగా...!'' అన్నాడు తమాషాగా నవ్వి.

శ్రీవల్లి బయలుదేరి ఇంటికి వచ్చేసింది. పొలాల్నీ, పనిచేస్తున్నవాళ్ళనీ, చెట్టూ చేమల్నీ పరిశీలనగా చూస్తూ... పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ నడవటం శ్రీవల్లికీ బావున్నట్లనిపించింది.

* * *